నేటి ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
తెలంగాణ ఉమ్మడి జిల్లాలు
ఆదివారం
24-8-2025

## వెంకటాపూర్ గ్రామానికి మరొక రేషన్ షాప్ కోసం వినతిపత్రం

మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 23:



మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామ ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వేల్పుల చిరంజీవి శుక్రవారం మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామిని కలిసారు. ఈ సందర్భంగా గ్రామంలో జనాభా పెరుగుతున్న దృష్ట్యా మరో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని మంత్రి వర్యులకు వినతిపత్రం సమర్పించారు.వేల్పుల చిరంజీవి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, ఒకే రేషన్ షాప్ సరిపోకపోవడం వల్ల రేషన్ తీసుకోవడానికి గంటల కొద్దీ క్యూలలో నిలబడాల్సి వస్తుందని, వృద్ధులు, మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు.ఈ వినతిని మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్వీకరించి, వెంటనే సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల అభ్యర్థనకు మంత్రి స్పందించినందుకు స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులు మంత్రి గారికి కృతజ్ఞతలు తెలుపుతూ, రాబోయే రోజుల్లో రేషన్ షాప్ ఆమోదం లభిస్తే తమ సమస్యలు తీరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎయిర్ ఫోర్స్ జవాన్‌కు నివాళులు



నేటి ప్రభాత సూర్య /నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 23

ముధోల్ మండలంలోని తరోడ గ్రామానికి చెందిన ఎయిర్ ఫోర్స్ జవాన్ లక్ష్మి ఈశ్వర్ ప్రసాద్ (25) ప్రమాదవశాత్తు జలపాతంలో పడి మృతి చెందడంతో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ శనివారం నివాళులర్పించారు. ఆగ్రా దగ్గర లో ఉన్న వాటర్ ఫాల్ లో ప్రమాదవశాత్తు జవాన్ దమ్మ వాటర్ ఫాల్ పడి మూడు రోజుల క్రితం మృతి చెందాడు. ఎమ్మెల్యే రెండు రోజుల క్రితం కేంద్ర మంత్రి బండి సంజయ్ తో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా వచ్చేటట్లు చర్యలు తీసుకున్నారు. శనివారం స్వగ్రామానికి మృతదేహం చేరుకుంది. దీంతో శవపేటికపై పుష్పగుచ్ఛం ఉంచి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుని కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నర్సగౌడ్, రవి తదితరులు ఉన్నారు.

## పులి సంచారం .. ప్రజల్లో భయాందోళనలు



మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 23:

హాజీపూర్ మండలం ర్యాలీ గడ్పూర్ గ్రామపంచాయతీ పరిధిలో పులి సంచారం కలకలం రేపుతోంది. శనివారం ఉదయం గ్రామ శివారులోని జొన్నలరాశి సమీపంలో పులి దాడికి గురైన ఒక ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పులి దాడి జరిగిందని వారు నిర్ధారించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో పులి సంచారం ఉన్నట్లు గుర్తించి, జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. పశువులను వదిలి పెట్టేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళ బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు.అధికారులు పులి కదలికలను గుర్తించేందుకు కెమెరా ట్రాపులు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైతే ప్రత్యేక బృందాలను నియమించి పులి సంచారం నియంత్రణ చర్యలు చేపడతామని వెల్లడించారు.ఈ సంఘటనతో గ్రామ ప్రజలు గుబులు చెంది భయాందోళనకు గురవుతున్నారు. పశువుల భద్రతతో పాటు గ్రామస్తుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నరు..

## ఉత్సవ ఏర్పాట్లలో విషాదం



మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 23:

హాజీపూర్ మండలం దొనబండలో శనివారం విషాద సంఘటన చోటుచేసుకుంది. గణేష్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా స్థానికులు ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ఇనుప స్టాండ్‌ను తరలిస్తుండగా ఆ స్టాండ్ పై భాగంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. ఈ ఘటనలో విద్యుత్ షాక్‌కు గురైన లక్షెట్టిపేట మండల గుళ్లకోట గ్రామానికి చెందిన ఆవునూరు లింగయ్య (వయసు సుమారు 35 ఏళ్లు) అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న వెంటనే హాజీపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లింగయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


ప్రతీ సంవత్సరం జరిపే గణేష్ నవరాత్రి వేడుకలలో పాలొనే ఉత్సాహంలో సురక్షిత చర్యలను విస్మరించడం ఇలాంటి ప్రమాదాలకు దారితీస్తుందనీ పోలీసులు, అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉత్సవాల ఏర్పాట్లలో విద్యుత్ లైన్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యా రంగంలో మరో మైలురాయిని అధిగమించిన గురునానక్ యూనివర్సిటీ

ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య, జూన్ ఇంచార్జ్- (ఆగస్టు 23)

ఇబ్రహీంపట్నం గురు నానక్ యూనివర్సిటి తన విద్యా ప్రస్థానంలో మరో కీలక మైలురాయిని సాధించింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బి సి ఐ) ఆమోదం పొందిన నూతన న్యాయ కోర్సులు ు బి. ఏ. ఎల్ .ఎల్. బి (5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం), ఎల్.ఎల్.బి (హానర్స్) (3 ఏళ్ల ప్రోగ్రాం) ప్రారంభించినట్లు గర్వంగా ప్రకటించింది. ఈ కోర్సులు విద్యార్థులకు నాణ్యత విద్యా, ప్రాక్టికల్ శిక్షణ మరియు నైతిక విలువలపై దృష్టి సారించేలా రూపొందించబడ్డాయని న్యాయ రంగంలో కెరీర్ ఆరంభించాలనుకునే యువతకు ఇది ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుందని యాజమాన్యం తెలియ చేసింది.యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా ఏర్పాటు ద్వారా, నాణ్యమైన న్యాయ విద్యను అందించడంపై యూనివర్సిటీ యొక్క అంకితభావాన్ని మరింత బలపరుస్తోంది. ఇది పరిశోధన సంస్కృతి పెంపొందించడానికి, విద్యార్థులను న్యాయవాదులు, కార్పొరేట్ న్యాయ నిపుణులు, న్యాయాధికారులు, న్యాయ రంగంలో నాయకులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని వారు తెలియచేసారు.

ఈ సందర్భంగా గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, వైస్ ఛాన్సలర్ డా. హెచ్.ఎస్. సైనీ, యూనివర్సిటీ రెక్టర్ డా. సి. కలైరా సాన్, రిజిస్ట్రార్ డా. విశాల్ వాలియా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ధన్యవాదాలు తెలియచేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ తమ యూనివర్సిటీ ద్వారా విద్యార్థులకు ఉత్తమమైన విద్యా, సమగ్ర విద్యార్థి అభివృద్ధిపై, అభివృద్ధి శీల విద్య ద్వారా దేశ నిర్మాణంపై విశ్వవిద్యాలయం నిబద్ధతను పునరుద్ఘాటించారు.



ఈ ఆవిష్కరణ, గురు నానక్ యూనివర్సిటీ 24 సంవత్సరాల విద్యా ప్రావీణ్యాన్ని ఆధునిక వృత్తిపరమైన కోర్సులతో మిళితం చేస్తూ, న్యాయ రంగంలో కొత్త మార్గాలను అన్వేషించాలనుకునే విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డుల పంపిణీ

### బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్

మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాతసూర్య.ఆగష్టు. 23:

పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం భారీగా పోస్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి గారికి పోస్ట్ కార్డులు పంపించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో పలు హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. ముఖ్యంగా,

1. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచి వాటినీ ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరిస్తామని,
2. మొదటి అసెంబ్లీ సెషన్‌లోనే మహాత్మా జ్యోతిబాపూలే పేరుతో చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ తీసుకువస్తామని,
3. ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్ మరియు మెయింటెనెన్స్ కాంట్రాక్ట్స్‌లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని,
4. ఐదేళ్లలో బీసీ సంక్షేమానికి లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని,
5. ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని,
6. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెడతామని,
7. అన్ని జిల్లా కేంద్రాల్లో రూ.50 కోట్లతో ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో బీసీ భవనాలు నిర్మిస్తామని ప్రకటించిందని వివరించారు.



అయితే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే 20 నెలలు అవుతున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, బీసీల ఓట్లు పొందడానికి మాత్రమే డిక్లరేషన్ చేశారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ అంశాన్ని బీసీ సమాజం ముందుకు తీసుకెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు గజెల్లి వెంకటయ్య, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, తుల మధుసూదన్, అశోక్ వేముల, కీర్తి బిక్షపతి, అంకం సతీష్, న్యాయవాది రామిళ్ళ నరేందర్, ఆరెందుల రాజేశం, రాగి రాజేష్, దగ్గురి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ వేధింపులు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని ఇబ్బంది పెట్టిన వ్యక్తి అరెస్ట్

మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 23:

మందమర్రి పట్టణంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని నకిలీ ఈమెయిల్ ఐడి ద్వారా అసభ్యకరమైన, అశ్లీలమైన సందేశాలు పంపుతూ తీవ్రంగా వేధించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

మందమర్రికి చెందిన యువతి, ప్రస్తుతం ఇంటి నుండి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఈమెకు 2025 మార్చి నుండి, ఓ వ్యక్తి నకిలీ ఈమెయిల్ ఐడి సృష్టించి, పదేపదే అసభ్యకరమైన మెసేజ్‌లు పంపించడం ప్రారంభించాడు. అంతేకాకుండా, ఆమె స్నేహితులను ట్యాగ్ చేస్తూ కించపరిచే విధంగా ఇబ్బందులు కలిగించాడు. ఈ వేధింపులు ఎక్కువవడంతో, బాధితురాలు 2025 జూన్ 7న మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.ఫిర్యాదు ఆధారంగా ఎస్సై రాజశేఖర్ ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం సిఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పడి దర్యాప్తు చేపట్టింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నకిలీ ఈమెయిల్ మూలాలను గుర్తించిన పోలీసులు, ఈ నేరానికి పాల్పడింది హైదరాబాద్‌కు చెందిన నెల్లి నిఖిల్ బాబు అని నిర్ధారించారు.

నిందితుడు ఎవరు?

పేరు: నెల్లి నిఖిల్ బాబు
తండ్రి పేరు: శేఖర్ బాబు
వయస్సు: 29 సంవత్సరాలు
వృత్తి: పాలసీ అడ్వైజర్, స్టార్ హెల్త్, ప్యారడైజ్ బ్రాంచ్, హైదరాబాద్
చిరునామా: కృష్ణ నగర్, మౌలాలి, సికింద్రాబాద్

నిందితుడు నిఖిల్ బాబును పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని మందమర్రికి తరలించారు. విచారణలో అతను తన నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని వద్ద నుండి నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.



### ప్రతీకారంతో చేసిన నేరం

బాధితురాలు గతంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు నిఖిల్ బాబు ఆమె సహోద్యోగి. ఆమెను ప్రేమిస్తున్నానని చెప్పగా, ఆమె తిరస్కరించింది. దీనికి ఆగ్రహించి, ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ దారుణానికి పాల్పడ్డాడు.

### సైబర్ నేరాలపై పోలీసుల హెచ్చరిక

మహిళల భద్రతకు తెలంగాణ పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని, ఆన్‌లైన్‌లో వేధింపులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని సిఐ శశిధర్ రెడ్డి హెచ్చరించారు.

### ప్రజలకు పోలీసుల సూచనలు

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా:

వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దు.

సోషల్ మీడియా ఖాతాల ప్రైవసీ సెట్టింగ్స్ కఠినంగా ఉంచుకోవాలి.

ఊహించలేని బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించాలి.

ఆన్‌లైన్ వేధింపులకు స్పందించవద్దు, సాక్ష్యాలను భద్రపరచాలి.

నిందితుడి ఖాతాలను వెంటనే బ్లాక్ చేసి, రిపోర్ట్ చేయాలి.

ఆన్‌లైన్ వేధింపులు ఎదురైన వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి కాల్ చేయాలని సూచించారు.

మీ భద్రత – మా బాధ్యత” అని పోలీసులు హామీ ఇస్తున్నారు.

## వేలాడుతున్న కరెంట్ వైర్లు .. తక్షణ చర్యలు చేపట్టాలని తుంగతుర్తి రవి సూచన

**"ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే స్పందించిన" ఏఈ సత్యనారాయణ రెడ్డి**






నేటి ప్రభాత సూర్య: మేడిపల్లి, (ఆగస్టు 23 శనివారం )

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 4వ డివిజన్ ఈస్ట్ లక్ష్మినగర్ కాలనీలో కరెంట్ వైర్లు ప్రమాదకరంగా కిందకి వాలిపోవడంతో పాటు పలు సమస్యలు నివాసితులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. స్థానికులు ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవికి తెలియజేయగా ఆయన వెంటనే స్థలాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులను పిలిపించి ప్రజలకు రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఎలాంటి సమస్యలు కలగకుండా పనులు పూర్తి చేయాలని,అలాగే పెండింగ్ లో ఉన్న రోడ్ల గురించి మాట్లాడి త్వరలో పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమం లో ఏఈ సత్యనారాయణ రెడ్డి,అజయ్ రెడ్డి,సంబంధిత అధికారులు స్థానిక కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వైన్స్, బార్‌లలో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి: అందే రాంబాబు



యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 23):

వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వైన్స్, బార్ టెండర్ లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్, వికలాంగుల రాష్ట్ర నాయకులు అందే రాంబాబు, విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికలాంగులకు ఉపాధి లేక, ఉద్యోగాలు లేక దుర్భర జీవితాలతో గడుపుతున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో , టెండర్ ల లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి, వికలాంగులకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ చారి, సోషల్ మీడియా నాయకులు కందుకూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండప నిర్వహకులు నిబంధనలు పాటించాలి

**లిమహేశ్వరం డిసిపి సునీత రెడ్డి**

ఇబ్రహీంపట్నం -నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 23)




గణేష్ మండప నిర్వహకులు నిబంధనలు పాటించాలని శనివారం సాయంత్రం 6 గంటలకు శాస్త్ర గార్డెన్ ఇబ్రహీంపట్నంలో మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో ఉన్న గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపి రాజు సిఐలు బ్రహీంపట్నం, ఫార్మాసిటీ, ఆదిభటట్ల,, మాడుగుల పోలీస్ అధికారులతోపాటు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ ఇబ్రహీంపట్నం, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, ఏఈ, ఇరిగేషన్ అన్ని శాఖల అధికారులు పాల్గొనడం జరిగింది. అన్ని విభాగాల నుండి గణేష్ మండపా నిర్వాహకులకు సూచనలు ఇచ్చి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని నివృత్తి చేశారు.



## పార్క్ స్థలం కబ్జా..

## అక్రమ నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా





తుర్కయంజాల్-నేటి ప్రభాతసూర్య:

అక్రమనకు గురైన పార్క్ స్థలంపై హైడ్రాధికారులు కొరడా ఝుళిపించారు. తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని 21 వ వార్డు

శ్రీ సూర్య సాయి నగర్ కాలనీలో సర్వేనెంబర్ 201లో 482 గజాల పార్కు స్థలంలోని ఆక్రమణలను గురైందని కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో శనివారం భారీ పోలీస్ బందోబస్తు నడుమ హైడ్రా ఇన్ స్పెక్టర్ తిరుమలేశ్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కి201 సర్వే నెంబర్ లో 283, 284 ప్లాట్లు 2018 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ అయిందని అధికారులు తెలిపారు. అనంతరం 482 గజాల పార్కు స్థలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కి సంబంధించిందని మున్సిపల్ అధికారులు బోర్డు ను పాతారు.

హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన తర్వాత అధికారులు మరింత దూకుడుగా వెళ్తున్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అధికారులకు ఫిర్యాదులు వస్తే వెంటనే రంగంలోకి దిగి చర్యలు చేపడుతున్నారు.పార్క్ స్థలాన్ని కాపాడినందుకు శ్రీ సూర్య సాయి నగర్ కాలనీవాసులు హైడ్రా అధికారులకు, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిభట్ల సీఐ రవికుమార్, ఎస్ఐ నోయల్ రాజ్, హైడ్రా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది శ్రీధర్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో కార్మిక శాఖ భవనం ఏర్పాటు చేయాలి

ఇబ్రహీంపట్నం - నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 23)



భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు ఉన్న వారికి 10 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ ఇవ్వాలని, శ్రీ మల్లికార్జున భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు 2 వ మహాసభ ఇబ్రహీంపట్నంలో పాషా నరహరి స్మారక కేంద్రంలో ఏర్పాటుచేసారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ మాట్లాడుతూ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటీయు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో భవన నిర్మాణ కార్మికులకు హెల్పర్ బోర్డులో ఉన్నటువంటి నిధులను వేరే సంస్థలకు మళ్ళించవద్దని, భవన నిర్మాణ కార్మికులకే వర్తింపచేయాలని, భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశత్తు చనిపోయిన వారికి ఇన్సూరెన్స్ పది లక్షల రూపాయలు ఇవ్వాలి, అంగ వైకల్యం కోల్పోయిన వారికి ఐదు లక్షలు, సహజ మరణానికి రెండు లక్షలు ఇవ్వాలి, 60 సంవత్సరాలు పై వయస్సు దాటిన వారికి నెలకు పదివేల పెన్షన్ ఇవ్వాలి, పెళ్ళికానుక 1లక్ష రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నికి డిమాండ్ చేశారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మండలం సాయగూడ గ్రామంలో కార్మిక శాఖ భవనం స్థలము ఏర్పాటు చేసింది, కోటి రూపాయలు భవనానికి కూడా నిధులు సాంక్షన్ చేయడం జరిగింది.కానీ ఇప్పటి వరకు భవనానికి ఎటువంటి పనులు చేయలేదు ఆ భవనానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేయాలని అన్నారు.ఈ మహాసభ సందర్భంగా నూతన కమిటీ 9 మంది తో ఎన్నుకోవడం జరిగింది, గౌరవ అధ్యక్షులు నర్కుడి యాదయ్య ,అధ్యక్షులు చింత పట్ల ఎల్లేశ , ప్రధాన కార్యదర్శి బొస్పల్లి రాజు, కోశాధికారి కొంగర జంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ .సంతోష్ కుమార్, ఓ. శ్రీను, సహాయ కార్యదర్శి లు, జి. అంకమ్మరావు , నర్కుడు సురేష, ఆర్గనైజర్ గా పచ్చల జంగయ్య లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వై స్వప్న,సిఐటియు మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశా, సీఐటీయూ నాయకులు బి.గిరి, ఇ. వీరేషం, వి వెంకటేష్ ఎం శివ,జి తిరుపతయ్య,ఎం మహేష్,కె శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి మోటారు ఏర్పాటుచేసిన మామిడి హరీష్

షాబాద్: నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 23)



సర్దార్ నగర్ గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య నుండి ఉపశమనం కలిగించేందుకు యువ నాయకుడు 'మామిడి హరీష్' ముందడుగు వేశారు. గ్రామంలోని %రాజ% కాలనీ లో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గుర్తించిన ఆయన కొత్తగా తాగునీటి మోటారును ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మా సమస్యను పరిష్కరించి తాగునీరు అందించిన మామిడి హరీష్ గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నాం ,నిజమైన ప్రజానాయకుడు మా పక్కనే ఉన్నాడన్న నమ్మకం మాకు కలిగింది అని ఆనందం వ్యక్తం చేశారు. సామాజిక సేవ తత్వంతో ముందుకు వస్తున్న యువ నాయకుడు గ్రామ అభివృద్ధికి సహాయపడతారని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు తాగునీటి మోటారు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఊరట లభించిందని వారు తెలిపారు.

మామిడి హరీష్ గారు మాట్లాడుతూ...

ప్రజల అవసరాలు నాకు ముఖ్యమైనవి ఎప్పటికప్పుడు గ్రామ ప్రజలు సమస్యలు నెరవేర్చడానికి కృషి చేస్తాను అని హామీ ఇచ్చాడు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ విజయ సింహ గారు, గ్రామస్తులు బి .పాండు, బి .యాదయ్య,బి .అశోక్, బి. రాజు కే. రామస్వామి, చంద్రయ్య మరియు పి.ఏ.ఆర్ యూత్ సభ్యులు మామిడి ప్రదీప్, తీగల శశాంక్ రెడ్డి ,సయ్యద్ సమీర్, మల్లిపెద్ది సంతోష్ గుప్తా, దేశెట్టి సాయికుమార్, కే .విజయ్ కుమార్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా పీస్ కమిటీ సమావేశం



మంచిర్యాల నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 23:

రామగుండం కమిషనరేట్ పరిధిలో గణేష్ నవరాత్రులు, మిలాద్-ఉన్-నబీ పండుగలు ఒకేసారి రావడంతో శాంతి భద్రతలపై పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ మేరకు రామగుండం సీపీ అంబర్ కిషోర్ జా (డీఐజీ) ఆధ్వర్యంలో, పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌ల సమక్షంలో శనివారం పీస్ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అన్ని మతాల ప్రజలు పరస్పర సహ కారంతో పండుగలను శాంతియుతంగా, అంగరంగ వైభవంగా జరుపుకోవాలని కోరారు. గణేష్ మండపాల వద్ద రాత్రి పూట కనీసం ఇద్దరు కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, భద్రతా చర్యలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అదేవిధంగా నిమజ్జనం రోజున మద్యం, మత్తు పదార్థాలు వాడరాదని, డీజేలకు ఎలాంటి అను మతులు లేవని అధికారులు స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసర ముందని, ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉం టారని తెలి పారు. "పోలీస్ డిపార్ట్‌మెంట్ మీ భద్రత కో సం ఉంది, ప్రజలు సహకరించాలని" సీపీ అంబర్ కిషోర్ జా పిలు పునిచ్చారు.ఈ సమావేశానికి మంద మర్రి హిందూ ఉత్సవ కమిటీ తరపున బండారు సూరి బాబు, కొంగల తిరుపతి రెడ్డి, మొహమ్మద్ అబ్బాస్, బొద్దున ఓంప్రకాష్, ఒజ్జ సాగర్ తదితరులు హాజరయ్యారు.




## గణేష్ మండపాల వద్ద డీజే లకు అనుమతి లేదు

**-డీజే యజమానులతో సమావేశం**

**-యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి**

**-నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు**



యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 23):

వినాయక చవితి పండుగను కుల మతాల అతీతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం యాచారం పోలీస్ స్టేషన్ కార్యాలయంలో డీజే యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాచకొండ సిపి ఆదేశాల మేరకు గణేష్ మండపాల వద్ద, శోభయాత్రలకు డీజే అనుమతి లేదని యజమానులతో తెలిపారు. డీజే వలన చిన్న పిల్లలకు, విద్యార్థుల చదువుకు, వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బంది కలిగి విధంగా శబ్దం వస్తుందన్నారు. డీజే వలన గుండెపోటు వస్తుందన్నారు. డీజే యజమానులు , గణేష్ నిర్వాహకులు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా చూడాలని కోరారు. లేదని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నవరాత్రులు భక్తి, పాటలతో, భక్తులు భజన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉయ్యాల మధు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం నిర్వహించాలి: సిఐ నరసింహారావు





కొత్తూరు, ప్రభాత సూర్య (ఆగస్టు 23)

గణేష్ మండపాలు నిబంధనల ప్రకారం మాత్రమే నిర్వహించాలి. సీఐ నరసింహారావు. శనివారం సాయంత్రం కొత్తూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన శాంతియుత సమావేశం ను ఉద్దేశించి సీఐ నరసింహారావు మాట్లాడుతూ..వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన మొదలుకొని నిమజ్జనం వరకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలని కోరారు.ముఖ్యంగా, మైక్ సెట్లు, డీజేల వాడకంపై నిబంధనల ప్రకారం నిర్వహించాలని అన్నారు. రాత్రి పది దాటిన తర్వాత ప్రజలకు ఇబ్బంది కలగకుండా సౌండ్ సిస్టంను నిలిపివేయాలని సూచించారు.అనుమతి లేని వాహనాలపై విగ్రహాల ఊరేగింపు నిర్వహించకూడదని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. నిమజ్జనం చేసే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు. పండుగ సమయంలో ప్రజల మధ్య ఐకమత్యాన్ని పెంచే విధంగా వ్యవహరించాలని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, కమిటీల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## కోటపల్లి మండలం దేవులవాడలో అభివృద్ధి పనుల ప్రారంభం



మంచిర్యాల జిల్లా,నేటి ప్రభాత సూర్య.ఆగస్టు 23 :

కోటపల్లి మండలం దేవులవాడ గ్రామంలో శుక్రవారం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్ మరియు సెంట్రల్ లైటింగ్ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి గారు గ్రామంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం మాట్లాడిన ఆయన, "ప్రతి గ్రామం వెలుగులతో నిండిపోవాలని, సౌకర్యాలతో అభివృద్ధి చెందాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది" అని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్లు, లైటింగ్, మౌలిక సదుపాయాలను ప్రాధాన్యతగా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ, మంత్రి వివేక్ వెంకటస్వామి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రైవేట్ స్కూల్‌లపై చర్యలు తీసుకోవాలి

**తానూరు మండల విద్యాశాఖ అధికారి సీసీఓ మతీన్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది**

**నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్**



నేటి ప్రభాత సూర్య / నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 23

ప్రైవేటు స్కూల్ లోబుక్స్ యూనిఫామ్స్ దందానీ అరికట్టాలి.నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ మాట్లాడుతూ తానూర్ మండల కేంద్రంలోని విద్యాసంవత్సరం కావడంతో ప్రయివేటు, స్కూల్ విద్యాసంస్థల ఫీజు దోపిడీ షురు అయ్యింది. తల్లి దండ్రుల గుండెల్లో దడ మొదలైంది. నగరంలో ఏటా అడ్డగోలుగా పుట్టుకొస్తున్న పాఠశాలలు.. ఎలాంటి గుర్తింపుతో సంబంధం లేకున్నా.. రకరకాల పేర్లతో ఇష్టం వచ్చినట్టుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్ నుంచి మొదయ్యే దోపిడీ కాస్త, పిల్లలకు అందించే పుస్తకాలు, బెల్ట్, టై, బూట్లు, డ్రెస్సుల వరకు వారి వద్దే కొనాల్సి ఉంటుంది. ఇలా అధిక ఫీజులు వసూలు చేసే యాజమాన్యాలపై నిఘా పెట్టాల్సిన కోరుతున్నాను చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయి అన్నారు. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఏటా ప్రతి ఏడాదీ నిలువు దోపిడీకి గురి కావాల్సి వస్తుంది తానూర్ మండల కేంద్రంలోని ఎం ఈ ఓ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేయడం జరిగింది..తానూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్,నవీన్ పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల దోపిడీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



నేటి ప్రభాత సూర్య నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 23

బీడీ కార్మికులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆర్జిఎన్ హ్యూమన్ రైట్స్ అవినీతి నిరోధక సంఘం ఆధ్వర్యంలో కార్మిక శాఖ అధికారి నవీన్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యవంశీ మాధవరావు పటేల్, కార్యదర్శి జల్ల హన్మండ్లు మాట్లాడుతూ భైంసా డివిజన్ పరిధిలోని చాత, కల్లూరు, నర్సాపూర్ హెడ్ ఆఫీసుల్లో బీడీ టెకెదారులు, కంపెనీ యజమాన్యం కార్మికులపై అక్రమ పద్ధతులు అమలు చేస్తున్నారని తెలిపారు. సౌన్ పాపడి, ఖుర్ ఖురే, గులాబ్ జామున్ వంటి కిరాణా వస్తువులను బలవంతంగా అందజేసి విక్రయాలు జరుపుతున్నారని, అదనంగా కమిషన్లు వసూలు చేస్తూ కార్మికుల కష్టార్జిత సంపాదనను దోచుకుంటున్నారని, అసలు బిల్లులు ఇవ్వకుండా పన్నులు ఎగవేస్తూ కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరుపుతున్నారని ఆరోపించారు.ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని పేర్కొన్న వారు, బీడీ కార్మికులకు న్యాయం చేయడానికి సమగ్ర విచారణ జరిపి, సంబంధిత యజమాన్యం మరియు టెకెదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారిని కోరారు.

## వైకల్యం జయించి ప్రతిభతో డాక్టరేట్ పొందాడు



నేటి ప్రభాత సూర్య నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 23

తానూర్: వైకల్యం వల్ల ఎన్ని అడ్డంకులు ఎదురైన ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా కాలంతో పోటీపడుతూ చదువునే నమ్ముకొని నెట్ సాధించి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డీ పూర్తి చేసిన బోనోడ్ పాండురంగకు డాక్టరేట్ లభించింది, నిర్మల్ జిల్లా తానూర్ జవులా(కె) గ్రామానికి చెందిన పోశెట్టి బోనోడ్ పంచ పూలబాయి దంపతుల కుమారుడు పాండురంగ వైకల్యం వల్ల చిన్నతనం నుండి ఎన్నో కష్టాలు పడుతూ ఎన్ని అవమానాలు ఎదురైన చదువును మాత్రం వదలకుండా హిందీలో నెట్, సెట్. లింగ్విస్టిక్ నెట్, మరాఠీలో నెట్ సాధించి అరుదైన ఘనత సాధించాడు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'నాయి సది కే హిందీ ఉపన్యాసమే సమాజిక్ చేతన' అనే అంశం మీద ప్రొఫెసర్ రాజశ్రీ పి మోరే పర్యవేక్షణలో పిహెచ్ఎ పూర్తి చేసి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ఇస్రో చైర్మన్ వి. నారాయణన్, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమారుల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొందాడు, పాండురంగ్ మాట్లాడుతూ నాకు వచ్చిన ఈ డాక్టరేట్ నా తల్లి దండ్రుల కష్టం, వ్యవసాయం చేస్తూ పేదరికం వల్ల ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైన నన్ను ప్రోత్సహించి ఈ డాక్టరేట్ పట్టా రావడానికి కృషి చేసిన నా తల్లి దండ్రులకు పాదాభివందనం, అదే విధంగా నా అన్నలు గంగాధర్, తిరుపతి, నా చెల్లె అనుసుయ, నా బావ ఓరగంటి లక్ష్మణ్, మరో చెల్లె సరోజన, బావ మోహన్లు నా కష్టాల్లో, సుఖాల్లో తోడుగా ఉంటూ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు,వారికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలియజేసాడు, పాండురంగ్ కు డాక్టరేట్ రావడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అతని మిత్రులు సంభరాలు జరుపుకున్నారు,ప్రొఫెసర్లు, బంధువులు,మిత్రులు పాండురంగకు అభినందించారు.

## అధికారిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు





నేటి ప్రభాత సూర్య / నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 23

ముధోల్ మండలంలోని తరోడ గ్రామానికి చెందిన లక్ష్మి ఈశ్వర్ ప్రసాద్ (25) ఎయిర్ ఫోర్స్ జవాన్ అంత్యక్రియలు అధికారికం లాంఛనాలతో శనివారం పూర్తయ్యాయి. వివరాల్లోకెళ్తే లక్ష్మీ ఈశ్వర్ ప్రసాద్ ఎయిర్ ఫోర్స్ న్యూఢిల్లీలో పనిచేస్తుండేవాడు. గత మూడు రోజుల క్రితం వరుస సెలవుల రావటంతో ఆగ్రా దగ్గరలో ఉన్న దమ్మ వాటర్ ఫాల్ లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. అయితే మృతదేహం స్వగ్రామమైన తరోడ కు శనివారం ఉదయం చేరుకుంది. దీంతో ఎయిర్ ఫోర్స్ అధికారి ప్రవీణ్ సింగ్ చౌహన్ ఆధ్వర్యంలో మృతదేహం పై ముందుగాఎయిర్ ఫోర్స్ జవాన్లు త్రివర్ణ పథకాన్ని శవపేటిక పై కప్పి , పుష్పగుచ్చం వేసి నివాళు లర్పించారు.

ఆనంతరం ప్రత్యేక రథంపై మృతదేహం ఉంచి శవయాత్ర కొనసాగింది. చివరి చూపు కొరకు మృతుని కుటుంబ సభ్యులు ,బంధువులు, గ్రామస్తులు, ఆయా గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్మశాన వాటికలో మృతదేహం చితిపై పెట్టి ఎయిర్ ఫోర్స్ జవాన్లు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి అధికారిక లాంచనాలతో ముగించారు. ఆనంతరం చితికి మృతుడి తండ్రి నిప్పంటించారు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు ,కుటుంబ సభ్యులు ,బంధువులు, రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సిఐ మల్లేష్, ఎస్ఐ బిట్ల పెర్సిస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు





మంచిర్యాల జిల్లా,నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 23:
చెన్నూర్ నియోజకవర్గం:

చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు గౌరవనీయులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గారు గత నెల రోజులుగా అనారోగ్యంతో ప్రజల మధ్యకివరలేకపోయారు. అయితే, ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్మాన్‌గా ఉండి, బడుగు బలహీన వర్గాలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ మందమర్రి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేష్ మాట్లాడుతూ, "ప్రేమ్ సాగర్ రావు గారు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండి ప్రజలకు సేవ చేయాలని కాంగ్రెస్ కుటుంబం తరపున మనసారా కోరుకుంటున్నాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మొహమ్మద్ నాయీమ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెవెల్లి శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధం జనార్ధన్, యువజన నాయకులు నడిగోట నరేందర్, కోప్పర్తి నవీన్, రంజిత్, అనిరుధ్, విజయ్, బంగారి అశోక్, అక్బర్, సంతోష్, బొద్దుల సురేష్, చందు, నరేష్, శ్రీనివాస్, జుగేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మందమర్రి ఏరియాలో ప్రశంసాపత్రాల ప్రదాన కార్యక్రమం

మంచిర్యాల జిల్లా.నేటిప్రబాతసూర్య.ఆగష్టు. 23:

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి. దేవేందర్ మాట్లాడుతూ, "గనుల్లో రక్షణ, ఆసుపత్రుల్లో సమయానుకూల వైద్యం అందిన రోజునే కార్మికుల జీవితం ఆనందమయం అవుతుంది" అని అన్నారు.శనివారం మందమర్రిలోని కేకే డిస్పెన్సరీలో నిర్వహించిన ప్రశంసాపత్రాల ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. గనుల్లో కార్మికులు కష్టపడి పనిచేస్తారని, అలాంటి సందర్భంలో ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు ఆసుపత్రి వైద్యులు ఉత్తమ సేవలు అందించడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. గని స్థాయిలో అధికారులు కార్మికుల రక్షణ కోసం, వైద్యులు ఆసుపత్రులలో ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేయాలని ఆయన సూచించారు.అలాగే, మందమర్రి ఏరియా కార్మికుల వైద్య సమాచారాన్ని డిజిటల్ రూపంలో అప్లోడ్ చేయడంలో విశేష పాత్ర పోషించిన సిబ్బందిని ప్రశంసించారు. సుమారు 40 వేల "%ా%" ఫాంలను హాస్పిటల్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లోకి విజయవంతంగా అప్లోడ్ చేసినందుకు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నక్క సుష్మకు, జనరల్ అసిస్టెంట్ నడిమెట్ల సాహిత్యకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.ఈ



సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ, "ఆసుపత్రి సిబ్బంది కష్టపడి పనిచేస్తేనే మంచి పేరు వస్తుంది. ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించాలనే నిబద్ధతతో ముందుకు సాగాలి" అని అన్నారు. కార్యక్రమంలో డీజీఎం (సివిల్) రాములు, సీనియర్ పర్సనల్ మేనేజర్ శ్యామ్ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వారరావు, డాక్టర్ శైలజ, డాక్టర్ శ్రీజ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతరిక్ష దినోత్సవం




నేటి ప్రభాత సూర్య / నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 23

భైంసా: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం భైంసా గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ మేజర్ సీ హెచ్ శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అబ్దుల్ కలాం లాంటి గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు, ఆర్యభట్ట లాంటి ప్రయోగాలు, చంద్రయాన్ వన్, టు, త్రీ, లాంటి ప్రయోగాలతో ప్రపంచంలో భారతదేశం ఎందులోనూ తక్కువ లేదని నిరూపించిన ఘనత మన శాస్త్రవేత్తలదని, ఇస్రో ఎన్నో ప్రయోగాలతో తన కీర్తిని ఇనుమడింప చేసిందన్నారు.విద్యార్థులు ఆదర్శనీయ వ్యక్తుల జీవితాలను ఎప్పటికప్పుడు చదువుతూ వారిని అనుసరిస్తూ ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కర్రోల్ల బుచ్చయ్య మాట్లాడుతూ.. అంతరిక్ష పరిశోధనలో మన దేశం అత్యంత గర్వనీయ స్థానంలో ఉందని చంద్రయాన్ వన్ గాని మంగళ్ యాన్ గాని చంద్రయాన్ 3 గాని ప్రయోగాలు చేసి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు సృజనాత్మకమైనటువంటి ప్రతిభను కలిగి ఉండాలని, వివిధ ఆవిష్కరణలు, ప్రయోగాలు చేస్తూ ముందు ఉండాలని రాకేష్ శర్మ ,కల్పనా చావ్లా ,సునీత విలియమ్స్, శుభాన్స్ శుక్ల లాంటి ఎందరో అద్భుతమైన అంతరిక్ష యాత్ర చేసి దేశ కీర్తిని నలు దిశల ఇనుమ డింప చేశారని అన్నారు.ఈ సందర్భంగా అంతరిక్షానికి సంబంధించి పలు ప్రదర్శనలు చేశారు. విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చంద్రయాన్ విజయవంతంపై తయారు చేసిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు.వివిధ పోటీలు నిర్వహించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘునాథ్, ఫిజిక్స్ అధ్యాపకులు శ్రావణ్య, రవికుమార్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల రాళ్లవాగులో వ్యక్తి మృతి: కుటుంబసభ్యుల ఆందోళన



మంచిర్యాల నేటి ప్రభాత సూర్య ఆగష్టు. 23:

రాళ్లవాగులో గొల్ల చిన్న గంగయ్య (38) అనే మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి మృతి చెందాడు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిన గంగయ్య కోసం కుటుంబ సభ్యులు గాలించారు. శుక్రవారం ఉదయం రాళ్లవాగులో మృతదేహం లభ్యం కావడంతో కుటుంబసభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ మజారుద్దీన్ తెలిపారు.

## రిలే నిరాహారదీక్షకు టీడీపీ సంపూర్ణ మద్దుతు

**ఎమ్మెల్యే జీఎం స్పందించాలని టీడీపీ డిమాండ్**



నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 23: ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో

మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని నర్సపూర్ గ్రామ పంచాయతీలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని గత ఆరు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం ముందు ఆదివాసులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు శనివారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సపూర్ చెక్ పోస్ట్ వద్ద హై లెవల్ బ్రిడ్జి, లచ్చుగుడెం దారిలో నూతన కల్వర్టు నిర్మాణం అలాగే నర్సపూర్ నుండి బెజ్జల రోడ్డుకు అటవీశాఖ అనుమతి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలోతాండూర్ మండల తుడుం దెబ్బ అధ్యక్షులు కుర్సెంగ బాబురావు, సోయం సురేష్, ఆత్రం బాదిరావు, సోయం వంశీకృష్ణ,ఆత్రం సురేష్ తదితరలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మేకల కనకయ్య ముదిరాజ్



నేటి ప్రభాత సూర్య/ గజ్వేల్ నియోజకవర్గ ప్రతినిధి :

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామనికి చెందిన ధనమైన బుధమ్మ శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మర్కుక్ మండల్ బి ఆర్ ఎస్ బి సి సెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ అదివారం రోజు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారితోపాటు ఉప్పరి యాదగిరి చిన్నబోయిని మల్లేష్ చెక్కల కరుణాకర్ మహేష్ ఎల్లం నర్సింలు తదితరులు ఉన్నారు.

## ఎస్బీఐ ఎదుట ఖాతాదారుల ఆందోళన



మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య. ఆగష్టు. 23:

చెన్నూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) బ్రాంచ్ ఎదుట శనివారం ఉద్రిక్తత నెలకొంది. బ్యాంకులో డిపాజిట్ చేసిన 30 తులాల బంగారం వెంటనే తిరిగి ఇవ్వాలని ఖాతాదారులు బహిరంగ ఆందోళనకు దిగారు.బ్యాంకు అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఖాతాదారులు వెనక్కి తగ్గలేదు. తమ బంగారాన్ని అప్పగించే వరకు కదిలేది లేదని, బ్యాంకు ముందు నిరసనను కొనసాగిస్తామని భీష్మించుకున్నారు.ఈ క్రమంలో స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించమని చెప్పి ఖాతాదారులు నిలదీస్తూ ప్రశ్నలు గుప్పించారు."మేము బ్యాంకులో నమ్మకంతో బంగారం డిపాజిట్ చేసాం. ఇప్పుడు ఇవ్వలేమని చెబితే మా బంగారానికి గ్యారంటీ ఎవరు ఇస్తారు?" అంటూ వారు బ్యాంకు అధికారులను నిలదీశారు.ఈ ఘటనతో ఎస్బీఐ బ్రాంచ్ వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికారుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చినప్పటికీ ఖాతాదారులు తమ డిమాండ్లపై ఆందోళనను కొనసాగిస్తున్నారు.

